

కుప్పంలో 40వేల టీడీపీ దొంగ ఓట్లు

కుప్పంలో టీడీపీ 40 వేలకు పైగా దొంగ ఓట్లను సృష్టించుకుందని ఎమ్మెల్సీ భరత్ ఆరోపించారు. - 8లో



భక్తి.. ముక్తికి.. కార్తికం

కార్తిక మాసం శివకేశవులకు అత్యంత ప్రీతికరం. ఆలయాలు దీపోత్సవ వెలుగుల్లో శోభిల్లుతాయి. - 8లో



గో సంరక్షణ ట్రస్టుకు రు.3 లక్షలు

కాణిపాకం వినాయక స్వామి దేవస్థానం గో సంరక్షణ ట్రస్టుకు రూ.3 లక్షల విరాళం అందింది. - 8లో

న్యూస్‌రీల్

19న బాల్ బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక

నగరి : ఉమ్మడి చిత్తూరు జిల్లా సీనియర్ బాల్ బాడ్మింటన్ జట్టుకు ఈనెల 19వ తేదీన క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బాలాజీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటలకు శ్రీకాళహస్తి మహిళా డిగ్రీ కళాశాల మైదానంలో అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటస్వామి సమక్షంలో క్రీడాకారుల ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. క్రీడాకారులు ఆధార్ కార్డు, బ్లడ్ గ్రూప్ సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. డ్రెస్ కోడ్ తప్పనిసరిగా పాటించాలని తెలియజేశారు. ఎంపికైన జట్టు డిసెంబర్ 9న అనంతపురం జిల్లాలో జరిగే అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని వివరించారు, వివరాలకు 7013754776 నంబర్‌ను సంప్రదించాలని బాలాజీ కోరారు.

నిత్య విద్యార్థిలా ఉండాలి..



మాట్లాడుతున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కార్పొరేషన్: ఎప్పుడు నిత్య విద్యార్థిలా ఉండాలని డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. బుధవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన పుస్తక ప్రదర్శనను ప్రారంభించి, ఆయన మాట్లాడారు. విద్యార్థులు పోటీ పరీక్షలకు ఉపయోపగడే పుస్తకాలను చదువుతూ విజ్ఞానం పెంచుకోవాలన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శర్మ మాట్లాడుతూ గ్రూప్–1, 2, బ్యాంక్ పీఓ, పోస్టల్ సహాయకులు, నేవీ ఇలా పలు రంగాల పోటీ పరీక్షలకు సంబంధించి పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. టీటీడీ విశ్రాంత యూనిట్ ఆఫీసర్ గోవింద స్వామి మాట్లాడుతూ విజ్ఞానం పెంపొందించుకునేందుకు వయస్సుతో సంబంధం లేకుండా గ్రంథాలయాలకు రావాలని తెలిపారు. గ్రంథాలయాధికారులు లలిత, మధుబాబు, రాజ్‌కుమార్, పూర్ణిమ పాల్గొన్నారు.

బకాయిలపై ప్రత్యేక దృష్టి పెట్టండి

చిత్తూరు కార్పొరేషన్: ప్రభుత్వ కార్యాలయాల విద్యుత్ బకాయిల వసూళ్లపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం చిత్తూరు అర్బన్, రూరల్ ఈఈ కార్యాలయాల్లో ఈఆర్వో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో రూ.1294 కోట్ల ప్రభుత్వ బకాయిలు ఉన్నాయని, వీటి వసూళ్లకు నోటీసులు ఇవ్వాలన్నారు. చిత్తూరు అర్బన్ రూ.25 కోట్లు, రూరల్ డివిజన్‌లో రూ.23 కోట్లు నాన్ గవర్నమెంట్ బిల్లులు 99 శాతం వసూలైనట్లు తెలిపారు. ఏఈలు పెండింగ్‌లోని వర్క్ ఆర్డర్లను ఈనెలాఖరు లోపు పూర్తి చేయాలన్నారు. ఈఈలు హరి, పద్మనాభ పిళ్లై, ఏఏఓ గీత, డీఈ శేషాద్రి, టెక్నికల్ ఏఈ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


డీవీఈఓగా సయ్యద్ మౌలా



అభినందనలు చెబుతున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు

చిత్తూరు కలెక్టరేట్ : ఇంటర్మీడియెట్ జిల్లా వృత్తి విద్యాశాఖాధికారిగా సయ్యద్ మౌలా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కేంద్రంలోని కణ్ణన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న ఆయనకు డీవీఈవోగా ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగిచ్చింది. గతంలో డీవీఈవోగా పనిచేస్తున్న దయానందరాజు రిలీవ్ అయ్యారు. ఈ మేరకు బుధవారం ఆయన పీసీఆర్ కళాశాల ప్రాంగణంలోని డీవీఈవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ఆయనను పలు కళాశాలల పిన్సిపాళ్లు, జేఎల్ అసోసియేషన్, ప్రభుత్వ కాంట్రాక్టు లెక్చరర్స్ ఫెడరేషన్, ఎస్‌సీ కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు.

సులభరీతిన విద్యా బోధన సాగాలి




విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ

చిత్తూరు రూరల్: విద్యార్థులకు అర్థమయ్యేలా సులభ రీతిన బోధన సాగాలని డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. చిత్తూరు నగర పరిధిలోని మాపాక్షి జెడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం డీఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్య బోధనపై ఆరా తీశారు. పలు పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యత ఉండాలని సూచించారు.

ఔను.. మీ ఓటే కీలకం

ప్రజాస్వామ్యం మనకిచ్చిన హక్కు ఓటు. అందరూ ఓటు హక్కును వినియోగించుకున్నప్పుడే దానికి సార్థకత ఉంటుంది. త్వరలో సార్వత్రిక ఎన్నికల సంగ్రామానికి ఎన్నికల సంఘం నిబంధనలు పాటిస్తూ జిల్లా అధికారిక యంత్రాంగం కసరత్తు చేస్తోంది. గత నెల 28న ముసాయిదా జాబితాను ప్రకటించింది. ఈ జాబితాలో ఏవైనా తప్పిదాలు ఉంటే సవరించుకునే అవకాశాన్ని కల్పించింది. జాబితాలో తమ ఓటు ఉందో లేదో తెలుసుకోవాలనే కుతూహలం ఓటర్లకు ఉంటుంది. ఓటర్ల సౌకర్యార్థం ఓట్ల వివరాలను ఆన్‌లైన్ విధానంలో వెబ్‌సైట్, ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా తెలుసుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. వాటిపై 'సాక్షి' ప్రత్యేక కథనం..





ఓటర్ సర్వీస్ పోర్టల్ వెబ్‌సైట్ చిత్రం



ముసాయిదా జాబితాలో మీ పేరు ఉందా?

- ఆన్‌లైన్ ద్వారా తెలుసుకునే అవకాశం
- హెల్ప్‌లైన్ యాప్‌లో సమగ్ర వివరాలు
- ఓటరు కార్డు నంబర్ ఉంటే చాలు
- జిల్లాలో 15,49,152 మంది ఓటర్లు
- అవగాహన ముఖ్యమంటున్న ఉన్నతాధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇటీవల ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం 15,49,152 మంది ఓటర్లు (సర్వీసు ఓటర్ల తో కలిపి) ఉన్నారు. ఇందులో పురుషులు 7,67,068 మంది, మహిళలు 7,81,976 మంది, ఇతరులు 108 ఉన్నారు. ఆ జాబితాలో ఏవైనా తప్పిదాలు జరిగి ఉంటే డిసెంబర్ 26వ తేదీ వరకు క్లెయిమ్స్ స్వీకరణకు అవకాశం కల్పించారు. అనంతరం 2024 జనవరి 5న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో ఓట్ల వివరాలు తెలుసుకోవాలంటే సెల్‌ఫోన్ చేతిలో ఉంటే సరిపోతుంది. మీ ఓటు ఉందో...లేదో, మీ ఇంటి డోర్ నంబర్‌లో ఎన్ని ఓట్లు ఉన్నాయో అన్న వివరాలను తెలుసుకోవచ్చు.

కొత్త ఓటుకు అవకాశం

ఎన్నికల సంఘం ఓటర్స్ సర్వీస్ పోర్టల్ వెబ్‌సైట్ ద్వారా ఓటు ఉందో లేదో తెలుసుకునే అవకాశాన్ని కల్పించింది. ఇందుకు voters.eci.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లాల్సి ఉంటుంది. ఇందులో సెర్చ్ ఇన్ ఎలక్ట్రోరల్ రోల్‌ను క్లిక్ చేయాలి. అక్కడ సెర్చ్ బై డీటైల్స్, సెర్చ్ బై ఎపిక్, సెర్చ్ బై మొబైల్ ఆప్షన్‌లలో ఏదో ఒక దాన్ని ఎంపిక చేసుకోవాలి. అందులో వివరాలు నమోదు చేసి, క్యాప్చా కోడ్ ఎంటర్ చేసిన తర్వాత సెర్చ్ చేస్తే మీకు ఓటు ఉందో లేదో తెలిసిపోతుంది. సెర్చ్ బై డీటైల్స్ అనేది కాస్తంత కఠినంగా ఉంటే, మిగిలిన రెండు ఆప్షన్‌లతో ఓటు ఉందో లేదో తెలుసుకోవచ్చు. సెర్చ్ బై మొబైల్ యాప్‌లో ఆ మొబైల్ నంబర్‌తో ఎన్ని ఓట్లు లింక్ అయి ఉన్నా ఆ వివరాలన్నీ తెలుస్తాయి. పై ఆప్షన్‌లతో మీ వివరాలు కనిపించకపోతే మీ ఓటరు జాబితాలో పేరు లేనట్లే. అప్పుడు సంబంధిత బూత్ లెవల్ అధికారి (బీఎల్‌వో)కి ఫిర్యాదు చేస్తే కొత్త ఓటుకు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవడం బాధ్యత అని అధికారులు వెల్లడిస్తున్నారు.

ఇలా తెలుసుకోవచ్చు

- ముందుగా ఆండ్రాయిడ్ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల్లో ఒకటి ఎంపిక చేసుకుని రిజిస్టర్ చేయాలి. తరువాత మీ ఓటు ఉందో లేదో తెలుసుకునేందుకు నాలుగు మార్గాలు ఉన్నాయి.
- బార్ కోడింగ్ స్కానింగ్ ద్వారా పాత ఓటరు కార్డుల ముందు భాగంలో బార్ కోడ్ ఉంటుంది. ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌లోని బార్ కోడ్ ఆప్షన్‌ను ఎంపిక చేసుకుని క్లిక్ చేయాలి. కెమెరా తెరుచుకోగానే ఓటరు కార్డుపై ఉన్న బార్ కోడ్ స్కాన్ చేస్తే మీ ఓటు కచ్చితమైన వివరాలు వస్తాయి.
- కొత్త ఓటరు కార్డులు క్యూఆర్ కోడ్‌తో వస్తున్నాయి. ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌లోని క్యూఆర్ కోడ్ ఆప్షన్ ఎంపిక చేసుకుని స్కాన్ చేస్తే వివరాలు తెలుస్తాయి.
- పేరు, తండ్రి పేరు, వయస్సు, జండర్, రాష్ట్రం , జిల్లా, నియోజకవర్గం వివరాలు నమోదు చేస్తే మీ ఓటు సమాచారం తెలుసుకోవచ్చు.
- ఓటు కార్డు నంబర్‌తో కూడా వివరాలు తెలుసుకోవచ్చు. ప్రతి ఓటర్ కార్డుకు నంబర్ ఉంటుంది. నంబర్ ఆప్షన్ ఎంచుకుని మీ కార్డు నంబర్ నమోదు చేస్తే ఓటు వివరాలు తెలుస్తాయి.
- పై నాలుగు విధానాల్లో ఇది చాలా సులువుగా ఉంటుంది. మీ వద్ద కార్డు లేకపోతే నంబరు ఉంటే కూడా మీ ఓటు వివరాలు తెలుసుకోవచ్చు.

పకడ్బందీగా కసరత్తు



ఎన్నికల నిబంధనల ప్రకారం కసరత్తు పకడ్బందీగా చేస్తున్నాం. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించగానే తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రచురించాం. జాబితాలను బీఎల్‌వోలకూ చేర్చాం. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కుకు నమోదు చేసుకునేలా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు, నిర్దేశిత తేదీల్లో ప్రత్యేక ఓటర్ల శిబిరాలు నిర్వహిస్తున్నాం. ప్రజాస్వామ్యం కల్పించిన ఓటు హక్కును అర్హులు కచ్చితంగా వినియోగించుకోవాలి.

– షణ్మోహన్, కలెక్టర్, చిత్తూరు

పకడ్బందీగా ఓటర్ల జాబితా పరిశీలన



మాట్లాడుతున్న డీఆర్ఓ రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో ఒకే డోర్ నంబర్‌లో పది కంటే ఎక్కువ ఓటర్లున్నట్లైతే పకడ్బందీగా పరిశీలన చేయిస్తున్నట్లు డీఆర్ఓ రాజశేఖర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. డీఆర్ఓ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేయిస్తున్నట్లు తెలిపారు. ఈవీఎంల మొదటి స్థాయి తనిఖీ పూర్తి అయిందన్నారు. ఇందులో తిరస్కరించిన ఈవీఎంలను సంబంధిత కంపెనీలకు తరలించనున్నట్లు తెలిపారు. సున్నా డోర్ నంబర్, ఒకే డోర్ నంబర్‌లో 10 కంటే ఎక్కువ ఓటర్లు ఓటర్లున్నట్లైతే క్షుణ్ణంగా పరిశీలన చేయిస్తున్నట్లు చెప్పారు. మృతి చెంది వారి పేర్లను తగిన ఆధారాలతో తొలగిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉదయ్‌కుమార్, పరదేశి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 14 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 69,041 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 22,415 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.19 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 14 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

గిరిజనుల త్యాగాలు మరువలేనివి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్, చిత్రంలో ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

రామకుప్పం: స్వాతంత్ర్యోద్యమంలో గిరిజనులు చేసిన త్యాగాలు మరువలేనివని ఎంపీ రెడ్డెప్ప అన్నారు. బుధవారం జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో గిరిజన స్వాభిమాన ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమాన్ని జెడ్పీ చైర్మెన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ గిరిజన పోరాట యోధుడు బిర్సా ముండా జయంతిని జన జాతీయ గౌరవ దివాస్‌గా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. నవంబర్ 15 నుంచి 26 వరకు దేశ వ్యాప్తంగా గిరిజన స్వాభిమాన ఉత్సవాలు నిర్వహించాలని కేంద్రం ప్రకటించిందన్నారు. అందులో భాగంగా గిరిజన తండాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తామన్నారు. గిరిజన పాఠశాల అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయిస్తామన్నారు. జెడ్పీ చైర్మెన్ శ్రీనివాసులు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో రాజకీయంగా గిరిజనులకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. జగనన్న వసతి, దీవెన కార్యక్రమాలతో జిల్లాలో గిరిజన విద్యార్థులకు రూ.8.16 కోట్లు అందించినట్లు చెప్పారు.

గిరిజనుల అభ్యున్నతే ధ్యేయం

ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ గిరిజన నాయకుడు బిర్సా ముండా 22 సంవత్సరాల వయస్సులో స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ వారిపై ఎదురు తిరిగారని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గిరిజనుల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. అనంతరం విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా నెర్నెల్లి గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి సూర్యవంశీకి ఎమ్మెల్సీ భరత్ ల్యాప్‌టాప్‌ను ఎంపీ రెడ్డెప్ప చేతుల మీదుగా వితరణగా అందజేశారు. గిరిజన సంక్షేమ అధికారి మూర్తి, రెస్కో చైర్మెన్ సెంథిల్, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, కో–కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, తహసీల్దార్ మురళీ, ఎంపీడీఓ శివశంకర్, గిరిజన నేతలు మోహన్‌నాయక్, భాస్కర్‌నాయక్, భూషణ్‌నాయక్, చిన్నరాజునాయక్, రవినాయక్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పండుగలా వ్యవసాయం

అన్నదాతకు అండగా సీఎం జగనన్న

- పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా
- సచివాలయం, ఆర్బీకే భవనాల ప్రారంభం



తిరుమణ్యంలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు: దేశానికి వెన్నెముక అయిన అన్నదాతకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొండంత అండగా నిలుస్తున్నారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. బుధవారం వడమాలపేట మండలం తిరుమణ్యం గ్రామంలో రూ.40 లక్షలతో సచివాలయం, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం నూతన భవనాలను మంత్రి ప్రారంభించారు. ఆర్బీకేలో కియోస్క్ మిషన్ ద్వారా 300 బస్తాల యూరియాను ఆర్డర్ చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ఆర్బీకే వ్యవస్థ ద్వారా వ్యవసాయాన్ని పండుగగా మార్చిందని స్పష్టం చేశారు. ఆర్‌బీకేల్లో అధికారులు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారని చెప్పారు. చంద్రబాబు తన పాలనలో వ్యవసాయం దండగా అంటూ రైతులను అవమానించారని గుర్తు చేశారు. నేడు ఆర్‌బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పరికరాలను సైతం సబ్సిడీతో ఇంటి ముంగిటే అందిస్తున్నామని, దీంతో రవాణా ఖర్చులు సైతం మిగిలిపోయాయంటూ రైతన్నలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఈ క్రాప్ బుకింగ్‌తో పంట నష్టపరిహారం అందించడంలోనూ ప్రభుత్వం దీమా నిస్తోందని చెప్పారు.

గాంధీ కలలుగన్న స్వరాజ్యం

మహాత్ముడు కన్న కలలను సాకారం చేసే దిశగా జగనన్న సచివాలయ వ్యవస్థను సైతం తీసుకువచ్చారని మంత్రి రోజా తెలిపారు. గతంలో ఒక సర్టిఫికెట్ పొందాలంటే మండల, జిల్లా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, సచివాలయాల వ్యవస్థతో ప్రయాసలకు, నిరీక్షణకు కాలం చెల్లిందని స్పష్టం చేశారు. సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.ప్రసాద్‌రావు, ఉద్యానవన అధికారి దశరథరామిరెడ్డి, వడమాలపేట ఏఓ విజయకుమార్, ఎంపీడీఓ భానుమూర్తి, వైఎస్సార్ సీపీ వడమాలపేట మండల కన్వీనర్ సుబ్రమణ్యంరెడ్డి, శాప్ డైరెక్టర్ యాదవేంద్రరెడ్డి, ఎంపీపీ విజయలక్ష్మి, సింగిల్ విండో ప్రెసిడెంట్ సుధీర్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.



ఆర్బీకేలో రైతు కార్యక్రమాలను ప్రారంభిస్తున్న మంత్రి రోజా

వైభవోత్సవం



స్వర్ణ రథోత్సవంలో పాల్గొన్న అశేష భక్తులు



గరుడ సేవలో విశేషాలంకరణలో అమ్మవారు

తిరుచానూరు (చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతీదేవి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజైన బుధవారం రాత్రి అమ్మవారు గరుత్మంతునిపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని వేకువనే సుప్రభాతంతో మేల్కొల్పి నిత్యకైంకర్యాలు సమర్పించారు. అనంతరం ఉట్టి కృష్ణుని అలకరణలో సర్వభూపాల వాహనంపై కొలువుతీరి భక్తులను అనుగ్రహించారు. మధ్యాహ్నం శ్రీకృష్ణస్వామి ముఖమండపంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం స్వర్ణరథంపై సౌభాగ్యలక్ష్మిగా అమ్మవారు తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను ఆశీర్వదించారు. రాత్రి 7గంటలకు ఊంజల్ సేవ జరిపించారు. అనంతరం అమ్మవారిని పట్టుపీతాంబరాలు, వజ్రవైఢూర్య ఆభరణాలు, శ్రీవారి పాదాలు, సహస్రలక్ష్మీ కాసుల హారంతో దివ్యాలంకార శోభితంగా అలంకరించారు. తదుపరి అమ్మవారు గరుడునిపై ఆశీనులై తిరువీధులలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. గురువారం ఉదయం 8గంటలకు సూర్యప్రభ, రాత్రి 7గంటలకు చంద్రప్రభ వాహన సేవలు ఉంటాయి.

సమస్యల పరిష్కారమే జగనన్నకు చెబుదాం



మృతి చెందిన కార్మికుల కుటుంబ సభ్యులకు చెక్ అందజేస్తున్న మేయర్, జేసీ, కమిషనర్

చిత్తూరు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం 'జగనన్నకు చెబుదాం'కు శ్రీకారం చుట్టిందని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు. బుధవారం చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని నిర్వహించారు. మేయర్ అముద, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, కమిషనర్ అరుణతో కలిసి జేసీ వినతులు స్వీకరించారు. జేసీ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు వారంలో రెండు రోజులు మండల కేంద్రాలు, మున్సిపాలిటీల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వినతులను అధికారులు నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలన్నారు. వినతులు పరిష్కారమయ్యాయా లేదా అని శాఖాధిపతులు పరిశీలించాలని తెలిపారు. ప్రజా సమస్యలను చిన్న కారణాలతో తిరస్కరించ వద్దని, పరిష్కరించలేని వాటికి సరైన కారణాలను అర్జీదారులకు వివరించాలన్నారు. కమిషనర్ అరుణ మాట్లాడుతూ వినతులను క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం నగరపాలక సంస్థలో పనిచేస్తూ మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియో చెక్కులను అందజేశారు. హౌసింగ్, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు పద్మనాభం, తులసి, రాధమ్మ, ఆర్డీవో చిన్నయ్య, డీఎంఅండ్‌హెచ్‌వో ప్రభావతి దేవి, ఎస్సీ వెల్ఫేర్ డీడీ రాజ్యలక్ష్మి, జిల్లా లేబర్ ఆఫీసర్ ఓంకార్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గో సంరక్షణ ట్రస్ట్‌కు రూ.3లక్షలు



ఆలయ అధికారులకు చెక్కు అందిస్తున్న చిత్తూరుకు చెందిన దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం గో సంరక్షణ ట్రస్టుకు బుధవారం రూ.3లక్షల విరాళం అందింది. చిత్తూరుకు చెందిన సర్వసిద్ధి వినాయక గ్రానైట్ అధినేత కుటుంబ సభ్యులు రూ.2లక్షలు, హైదరాబాద్‌లోని మాదాపూర్‌కు చెందిన సింధుజ, శ్రీకాంత్ రూ.లక్ష వేర్వేరుగా ఆలయ అధికారులకు విరాళంగా అందజేశారు. వారికి ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందించారు.

కబడ్డీ రాష్ట్ర జట్టుకు ఎంపిక





జాన్ పీటర్, రోహిత్

నింద్ర: కబడ్డీ రాష్ట్ర స్థాయి పోటీలకు స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఇద్దరు ఎంపికైనట్లు హెచ్‌ఎం శివయ్య తెలిపారు. పదో తరగతి విద్యార్థి జాన్ పీటర్, ఎనిమిదో తరగతి విద్యార్థి రోహిత్ ఇటీవల చిత్తూరులో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికై నట్లు పేర్కొన్నారు. ఈనెల18 నుంచి అన్నమయ్య జిల్లా చిట్వేలిలో జరిగే పోటీల్లో ఇద్దరూ పాల్గొంటారని తెలిపారు.

సీఐ మద్దెయ్య ఆచారి బదిలీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు టూటౌన్ సీఐ మద్దెయ్య ఆచారి రాజంపేట అర్బన్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. బుధవారం ఆయన ఇక్కడ రిలీవ్ అయ్యారు. చిత్తూరు టూటౌన్ స్టేషన్‌కు ఇంకా ఎవర్నీ నియమించలేదు.

భక్తి..ముక్తికి.. కార్తికం

మాసాల్లో కార్తికం..యుగాల్లో కృత యుగం.. శాస్త్రాల్లో వేదం..తీర్థాల్లో గంగానదికి సమానమైనవి లేవన్నది పురాణ వచనం. అంతటి మహత్యం ఉన్న కార్తిక మాసం శివకేశవులిద్దరికీ ప్రీతిపాత్రమైంది. అందుకే భక్తులు వేకువనే చన్నీటి స్నానాలు.. జప, తప నియమాలు..పూజలు.. ఉపవాసదీక్షలు చేస్తారు. కార్తిక మాస విశిష్టతపై ప్రత్యేక కథనం.

- ధ్యానం, దీపం ప్రత్యేకం
- వత్రాలు, నోములకు ప్రాధాన్యం
- దీపోత్సవాలకు ఆలయాలు ముస్తాబు
- కార్తీక నెల ప్రారంభం



చిత్తూరు శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

చిత్తూరు రూరల్: కార్తిక మాసంలో చంద్రుడు కృత్తికా నక్షత్రంలో ఉండడంతో ఈ నెలకు ఆ పేరు వచ్చింది. ఈ నెల శివకేశవులిద్దరికీ ప్రీతికరం. ఈ నేపథ్యంలో ఊరూరా హరిహర నామస్మరణతో మార్మోగనున్నాయి. రాత్రి వేళల్లో దీపాల వెలుగులు విరజిమ్మనున్నాయి. ఎంతో పవిత్రంగా భావించే కార్తిక మాసం వచ్చే నెల 12వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ నెల రోజులు శైవ, వైష్ణవ క్షేత్రాలు భక్తుల సందడితో కిటకిటలాడనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 1,197 దేవాలయాలున్నాయి. వీటిలో శివాలయాలు 45 వరకు ఉన్నాయి. ఈ ఆలయాల్లో కార్తిక పూజలు శ్రేష్ఠంగా జరుగుతుంటాయి. ముఖ్యంగా కార్తిక సోమవారాల్లో ఆలయాలు భక్తులతో కళకళలాడనున్నాయి. ఇందుకు కావాల్సిన ఏర్పాట్లను ఆయా ఆలయ నిర్వాహకులు చేస్తున్నారు. భక్తులు ఇబ్బందులు లేకుండా దీపారాధన చేసేందుకు పనులు పూర్తి చేశారు.

కార్తిక స్నానం

కార్తిక మాసమంతా తెల్లవారుజామునే లేచి నది, చెరువు, కాలువల్లో కానీ, ఈ వనరులు అందుబాటులో లేకుంటే ఇంట్లో కానీ తలస్నానం చేయాలి.అప్పుడే కార్తిక స్నానం అవుతుంది. ఈ నియమంతో స్నానం చేసి, శివుడు, విష్ణువు, మరే దైవాన్ని అయినా ధ్యానించి, ఆర్ఘం ఇవ్వడంతో గంగానది, పుష్కర తీర్థాల్లో స్నానం చేసిన ఫలితం దక్కుతుందని పురాణాలు చెబుతాయి. సర్వ పాపాలు తొలగుతాయని భక్తుల నమ్మకం.

పుణ్యప్రదం.. కార్తిక దీపం

భారతీయ సంస్కృతిలో దీపారాధనకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. కార్తిక మాసంలో దీపారాధనకే ప్రథమ స్థానం. అందుకే ఇంట్లోకానీ, శివాలయంలో కానీ ప్రాతఃకాలం, సాయంకాలం దీపారాధన చేస్తారు. ఎవరైనా తెలిసికానీ, తెలియకుండా కానీ ఎక్కడైనా సరే దీపం పెడితే వారి పాపాలు హరిస్తాయని పురాణాలు తెలుపుతున్నాయి. దీపం, బంగారం, నవధాన్యాలు, అన్నం దానం చేస్తే స్త్రీలకు సౌభాగ్యం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం. అందుకే దీపారాధనతో పాటు శివుడికి ప్రత్యేకంగా రుద్రాభిషేకం, లక్షబిల్వార్చ, అమ్మవారికి లక్షకుంకుమార్చన జరిపిస్తారు. ఆలయాల్లో ప్రత్యేకంగా అర్చకులకు వివిధ రకాల దానాలు చేస్తారు.

కార్తికం.. ఆచరణ ఇలా

- కార్తిక మాసంలో మాంసాహారానికి దూరంగా ఉండాలి
- తేలికైన ఆహారం భుజించాలి
- ఉల్లి, వెల్లుల్లి తినకూడదు
- పాలు, పండ్లు భుజించవచ్చు
- రాత్రి భోజనం చేయకూడదు. దైవ దూషణ చేయకూడదు.
- తప్పుడు పనులు చేస్తే పాపమని పురాణాలు చెబుతున్నాయి.



భక్తుల సందడి

వన భోజనం

ప్రకృతి ఒడిలో సేదతీరుతూ అప్యాయతలను పంచుకునే సందర్భం వనభోజనం కార్తిక మాస ప్రత్యేకం. ఐక్యత సాధనకు ఇది ఎంతో ఉపకరణం. కలిసిమెలిసి మసలుకునే తత్వం వనభోజన సంబరాలతో అలవడుతుంది. ఈ కార్యక్రమం వనాలపై మన బాధ్యతను గుర్తు చేస్తుంది. ఈ భోజన సంబరంలో పూర్తి సాత్విక వంటకాలనే భుజిస్తారు.

పుణ్యఫలం సిద్ధిస్తుంది



కార్తీక మాసంలో ప్రతి రోజు కూడా అత్యంత శ్రేష్ఠమైంది. కార్తిక మాసం శివకేశవులకు చాలా ప్రీతపాత్రమైంది. తెల్లవారుజామునే ఆలయాలను దర్శించుకుని పూజలు చేయాలి. ఈ మాసంలో శివకేశవులను పూజిస్తే మహాపుణ్యం లభిస్తుంది. ఈ మాసంలో ప్రతి ఇంటా దీపాలు వెలిగించాలి. ఈ దీపాలు మనిషిలోని అజ్ఞానాన్ని పారద్రోలే జ్ఞాన జ్యోతులు కావాలి. ఈనెల 17న నాగుల చవితి, 18న స్కందషష్టి, 26న కార్తీకదీపం అతిముఖ్యమైన పండుగలు.

-సుధాకర్ గురుకుల్, వేదపండితులు, చిత్తూరు

ప్రజలతో మమేకమై..



గుండ్రాజుకుప్పం దళితవాడలో 'సాక్షి' పత్రిక చదువుతున్న మంత్రి ఆర్కేరోజా

నగరి : మండలంలోని గుండ్రాజుకుప్పం దళితవాడలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా పల్లె నిద్ర చేసిన రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా బుధవారం ఉదయం దళితవాడలో ప్రజాప్రతినిధులు, స్థానికులతో సమావేశమయ్యారు. 'సాక్షి' పత్రికలో వచ్చిన వార్తలను చదువుతూ.. వార్తా విశేషాలను అందరితో పంచుకున్నారు. రాష్ట్ర మంత్రి తమ గ్రామంలోని ఒక సాధారణ మహిళలా అందరితో కలిసి తిరగడం, తమ మధ్య కూర్చొని సమస్యలపై చర్చించడం, కలిసి భోంచేయడం లాంటివి గ్రామస్తులను ఎనలేని ఆనందానుభూతిని, ఆశ్చర్యాన్ని కలిగించింది. ఇదికదా నిజమైన ప్రజాపాలన అంటూ గ్రామస్తులు చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీలు కన్నియప్ప, డిల్లి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సుదర్శన నాయుడు, నాయకులు నిరంజన్ రెడ్డి, గుణశేఖర్, గోవర్ధన్, గృహ సారథులు పాల్గొన్నారు.

కుప్పంలో 40వేల టీడీపీ దొంగ ఓట్లు

- జాబితా సవరణకు కష్టించి పనిచేయాలి
- బూత్ ఏజెంట్ల సమావేశంలో ఎమ్మెల్సీ భరత్

కుప్పం: దొంగ ఓట్లతో దశాబ్దాలుగా గెలుస్తూ వస్తున్న తెలుగుదేశం పార్టీని దెబ్బతీయాలంటే ఓటరు జాబితా సవరణ జరగాలని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. బుధవారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కుప్పం, గుడుపల్లె మండలాల బూత్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. భరత్ మాట్లాడుతూ పార్టీ శ్రేణులు నిబద్ధతతో పని చేస్తే ఈసారి కుప్పంలో వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యమన్నారు. క్షేత్ర స్థాయిలో దొంగఓట్లను గుర్తించాల్సిన బాధ్యత బూత్ ఏజెంట్లపై ఉందని తెలిపారు. నామమాత్రంగా పనిచేసేవారు అవసరం లేదని, అలాంటి వారు గౌరవంగా తప్పుకుంటే పార్టీ కోసం క్రియాశీలకంగా పనిచేసే వారికి అవకాశం ఇస్తామని ఆయన తెలిపారు. తెలుగుదేశం పార్టీవారు కుప్పం సరిహద్దులోని కృష్ణగిరి, హోసూర్, తిరుపత్తూరు, సేలం వంటి ప్రాంతాల్లో దొంగ ఓట్లు పెట్టుకుని, ఎన్నికల సమయంలో వారిని పిలించుకుంటున్నారని ఆరోపించారు. సుమారు 40 వేల వరకు టీడీపీ దొంగ ఓట్లు సృష్టించుకుందని విమర్శించారు. ప్రభుత్వ వ్యవస్థలను, అధికారులను మేనేజ్ చేయడం టీడీపీ నేతలకు వెన్నతో పెట్టి విద్య అని అన్నారు. ఇప్పుడు వైఎస్సార్ సీపీ గెలుపునకు మంచి అవకాశాలు ఉన్నాయని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలతో ప్రజలకు మంచి జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మళ్లీ జగన్ మోహన్‌రెడ్డిని సీఎంగా చేసేందుకు ప్రజలు ఉత్సాహంగా ఉన్నారని, ఇలాంటి పరిస్థితుల్లో కుప్పంలో ప్రజలకు జరిగిన మంచిని వివరించాలని సూచించారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా, 35 ఏళ్లు శాసన సభ్యుడిగా ఉన్నా నియోజకవర్గ అభివృద్ధికి చంద్రబాబు చేసిందేమీ లేదని ఆరోపించారు. కష్టపడి పనిచేస్తే విజయం మనదేనని తెలిపారు. కుప్పం, గుడుపల్లె ఎంపీపీలు వరలక్ష్మి, అశ్విని, జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి, శరవణ, పార్టీ మండల కన్వీనర్ మురుగేష్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే కుప్పానికి కృష్ణా జలాలు

- నెలాఖరులోపు రైతులకు పరిహారం చెల్లింపు
- జిల్లా కలెక్టర్ షణ్మోహన్



నివేదికలు పరిశీలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

శాంతిపురం: త్వరలోనే కుప్పం ప్రాంతానికి కృష్ణానది జలాలను తీసుకు వచ్చేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ వెల్లడించారు. బుధవారం గుండిశెట్టిపల్లె వద్ద హంద్రీ-నీవా కుప్పం కాలువను పరిశీలించి, కాలువ కోసం భూములు కోల్పోయిన రైతులతో మాట్లాడారు. కుప్పం కెనాల్‌లోకి నీరు వచ్చేందుకు శంకర్రాయులపేట, కృష్ణాపురం, ఆదినపల్లె వద్ద మూడు ఎత్తిపోతల యూనిట్లు ఉన్నాయన్నారు. వీటిలో రెండు చోట్ల లిఫ్ట్ పనులు పూర్తి అయ్యాయని, ఆదినపల్లె వద్ద మరో వారం రోజుల్లో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాలువ కోసం భూములు కోల్పోయిన రైతులకు నెలాఖరులోపు పరిహారం చెల్లిస్తామని తెలిపారు. రికార్డులు సక్రమంగా ఉండి, ఆయా భూముల్లో సాగులోని రైతులను ఏ కేటగిరీగా, రికార్డులు లేదా అనుభవం మాత్రమే ఉన్న వారిని బీ కేటగిరిగా, రెండవ కేటగిరీలో అర్హతలు లేనివారిని సీ కేటగిరిగా గుర్తించి పరిహారం చెల్లిస్తామని వివరించారు. ఎమ్మెల్సీ భరత్, ఆర్డీవో శ్రీనివాసులు, హంద్రీనీవా డీఈ రమేష్, డెప్యూటీ తహసీల్దార్ కొలేష్ పాల్గొన్నారు.

స్వచ్ఛత అమలు భేష్



అరగొండలో ఇంకుడు గుంతలను పరిశీలిస్తున్న సభ్యులు

తవణంపల్లె: అరగొండలో స్వచ్ఛత కార్యక్రమంలో తవ్విన ఇంకుడు గుంతలను పరిశీలించి కేంద్ర ఉద్యోగుల బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లుగా ఎంపికైన ఉద్యోగుల బృందం శిక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. మండల కేంద్రంలోని మహిళా చేయూత మార్ట్‌ను పరిశీలించారు. ఉపాధి పనులను పరిశీలించారు. ముందుగా మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొని సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఎలా చర్చ జరుగుతుందో ఎమ్మెల్యే ఎంఎస్.బాబును అడిగి తెలుసుకున్నారు. అరగొండలో డంపింగ్ యార్డును పరిశీలించారు. సచివాలయాల పనితీరు, డ్వాక్రా సంఘాల నిర్వహణపై ఆరా తీశారు. బృందం సభ్యులు సత్యంగౌహాన్, షయాలిప్రియదర్స్, అంకితసిన్హా, దేరజ్‌కుమార్, శషాక్‌జైన్, సౌరబ్‌మీనా, కోఆర్డినేటర్లు హనుమంతు రావు, యాదమరి ఈఓపీఆర్‌డీ హరిప్రసాద్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కచ్చితంగా ఉమ్మడి ఖాతా తెరవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విద్యాదీవెన పథకానికి కచ్చితంగా సంబంధిత విద్యార్థులు, తల్లి పేరుతో ఉమ్మడి ఖాతా తెరవాలని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 24వ తేదీ లోపు ఉమ్మడి ఖాతా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులను ఇబ్బంది పెట్టకుండా బ్యాంకర్లు సహకరించాలని తెలిపారు. విద్యార్థి, తల్లి పేరుతో ఉమ్మడి ఖాతా ఉంటేనే జగనన్న విద్యాదీవెన నాలుగో విడత లబ్ధి చేకూరుతుందని చెప్పారు. ఎస్సీ విద్యార్థులకు, 2022–23 విద్యాసంవత్సరంలో డిగ్రీ, డిప్లొమా, బీటెక్, ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు ఖాతా తెరవాల్సిన అవసరం లేదన్నారు. బీసీ, ఈబీసీ, మైనారిటీ, కాపు, ఎస్టీ విద్యార్థులు ఉమ్మడి ఖాతాలను కచ్చితంగా తెరవాలని తెలిపారు. ఈ కసరత్తును ఆయా సంక్షేమ శాఖల అధికారులు పర్యవేక్షించి పకడ్బందీగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సోషల్ వెల్ఫేర్ డీడీ రాజ్యలక్ష్మీ, బీసీ డీడీ రబ్బాని బాషా, ఎల్‌డీఎం హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదు నమోదులో నిర్లక్ష్యంపై ఎస్పీ ఆగ్రహం

చిత్తూరు అర్బన్: బంగారు నగలు చోరీ అయ్యాయంటూ ఫిర్యాదు ఇవ్వడానికి పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన బాధితుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై చిత్తూరు ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రోజుల కిందట ఎస్‌ఆర్ పురం మండలం పుల్లూరు క్రాస్ వద్ద బస్సు ఎక్కిన రమా, అనసూయ నుంచి 40 సవర్ల వరకు బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. దీనిపై ఫిర్యాదు చేసేందుకు వారు చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళితే, జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాల్సిన అధికారులు ఫిర్యాదు తీసుకోలేదు. గంగాధరనెల్లూరుకు వెళితే బస్సు ఎక్కిన పరిధి స్టేషన్‌కు వెళ్లమన్నారు. తీరా ఎస్‌ఆర్‌పురం మండలంలో కేసు నమోదు చేశారు. అయితే బాధితుల పట్ల పోలీసు అధికారుల నిర్లక్ష్యంపై పత్రికల్లో కథనాలు రావడంతో ఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్దేశ పూర్వకంగా ఫిర్యాదు తీసుకోకుండా ఉంటే నివేదిక ఇవ్వాలని చిత్తూరు, నగరి డీఎస్పీలను ఆదేశించారు.

కార్తీక దీపోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

తిరుపతి కల్చరల్: కార్తీక దీపోత్సవాల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని టీటీడీ జేఈఓ సదా భార్గవి ఆదేశించారు. బుధవారం తిరుపతి పద్మావతి విశ్రాంతి గృహంలో అధికారులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ 20న తిరుపతిలో టీటీడీ పరిపాలన భవనం వెనుక పరేడ్ గ్రౌండ్‌లో కార్తీక దీపోత్సవాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. 27న కర్నూలులోని ఏపీఎస్పీ గ్రౌండ్స్, డిసెంబర్ 11న విశాఖలోని ఆర్‌కే బీచ్‌లో శ్రీకాళీమాత ఆలయం ఎదురుగా దీపోత్సవాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమాలను ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేస్తుందన్నారు. 20 సాయంత్రం 5.30 గంటలకు వేద స్వస్తితో దీపోత్సవం ప్రారంభమవుతుందని, అనంతరం దీప ప్రాశస్త్యం, టీటీడీ చైర్మన్ సందేశం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, విష్ణు సహస్రనామ పారాయణం, మహాలక్ష్మీ నృత్య రూపకం, గోవిందనామాలు, చివరిగా కుంభ హారతితో రాత్రి 8.30 గంటలకు కార్యక్రమం ముగుస్తుందని వివరించారు. సమావేశంలో తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు, ఎస్వీబీసీ సీఈఓ షణ్ముఖ్ కుమార్, ఎస్‌ఈ–2 జగదీశ్వర్‌రెడ్డి, వీజీఓ బాలిరెడ్డి, ధార్మిక ప్రాజెక్టుల ప్రోగ్రామ్ అధికారి రాజగోపాల్ డైరెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కరాటేలో రాష్ట్ర స్థాయి పతకం



భవ్యశ్రీని అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

పుత్తూరు: స్కూల్ గేమ్స్ కరాటే రాష్ట్ర స్థాయి పోటీల్లో గేట్‌పుత్తూర్ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఎం.భవ్యశ్రీ తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు హెచ్‌ఎం కె.రవి తెలిపారు. బుధవారం పాఠశాలలో విద్యార్థి భవ్యశ్రీ అభినందన కార్యక్రమం జరిగింది. హెచ్‌ఎం మాట్లాడుతూ ఈ నెల 10న విశాఖపట్నంలో అండర్–19 విభాగంలో 60 కేజీల కేటగిరిలో భవశ్రీ అత్యుత్తమ ప్రదర్శన చేసి పతకం సాధించినట్లు తెలిపారు. అలాగే పాఠశాలకు చెందిన విద్యార్థులు నవీన్‌కుమార్, జాఫర్, నిరంజన్ సాయి, భరత్ రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ అండర్–17 విభాగానికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. క్రీడాకారులతో పాటు వారికి శిక్షణ ఇస్తున్న పీడీ జయదేవ్‌ను హెచ్‌ఎం అభినందించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఆర్కేఎస్సార్ విద్యార్థులు



విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

కార్వేటినగరం: వాలీబాల్, హ్యాండ్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఆర్కేఎస్సార్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం కోటేశ్వరరావు తెలిపారు. బుధవారం పాఠశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించింది. హెచ్‌ఎం మాట్లాడుతూ ఈనెల 9, 10 తేదీల్లో విశాఖపట్టణంలో జరిగిన జిల్లా స్థాయి అండర్–14 వాలీబాల్, హ్యాండ్‌బాల్ పోటీల్లో 9వ తరగతి విద్యార్థి నిఖిల్‌ఆర్య, జశ్వంత్ పాల్గొని, ప్రతిభ కనబరచి ద్వితీయ స్థానంలో నిలిచి ప్రసంశా పత్రాన్ని అందుకున్నారని తెలిపారు.

20న టెన్నికాయిట్ జట్టు ఎంపిక

గంగవరం: గంగవరం జెడ్పీ హైస్కూల్‌లో ఈనెల 20వ తేదీన టెన్నికాయిట్ జిల్లా జట్టును ఎంపిక చేయనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు పరశురాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 15 ఏళ్లు పైబడిన విద్యార్థులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని, ఓపెన్ టు ఆల్ క్యాటగిరీలో క్రీడాకారుల ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు. ఎంపికైన జట్టు డిసెంబర్ మొదటి వారంలో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు.